క్లుప్తంగా...

ప్రత్యేక పూజలు



యాకుత్‌పురా: శ్రీ నరసింహా స్వామి జయంతి సందర్భంగా మొఘల్‌పురాలోని శాలిగ్రామ నరసింహ ఆలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్.పి.క్రాంతి కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి సునీల్, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

యాకుత్‌పురాలో విషాద ఛాయలు

చార్మినార్: సిద్దిపేట వర్గల్ మండలంలోని సామలపల్లి ఊరి చెరువులో గురువారం ప్రమాదవశాత్తూ పడి మృతి చెందిన వారు పాతబస్తీ యాకుత్‌పురలోని ఎస్ఆర్‌టీ కాలనీకి చెందిన వారు. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానికంగా విశాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను తీసుకునేందుకు మృతుల కుటుంబసభ్యులు గజ్వేల్‌కు బయలుదేరి వెళ్లారు. మృతదేహాలను గజ్వేల్ ఏరియా ఆస్పత్రిలో మృతదేహాలను భద్రపరిచారు. దీంతో కుటుంబసభ్యులు అక్కడే ఉండిపోయారు. యాకుత్‌పుర బడేబజార్‌లో ఎఫ్‌కే బిర్యానీ హోటల్‌ను నిర్వహిస్తున్న షేక్ సర్దార్ కుమారుడు షేక్ కైసర్‌కు సోదరుని వరుసైన సోహెల్‌తో పాటు సర్దార్ మనుమడైన షేక్ ముస్తఫా ఊరి చెరువులో పడి ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం వీరి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించనున్నారు. అనంతరం వారి మృతదేహాలను బంధువులకు అప్పగించనున్నారు. మూడేళ్ల షేక్ ముస్తఫా ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ ఊరి చెరువులో పడిపోవడంతో షేక్ కైసర్, మహ్మద్ సోహెల్ కాపాడే ప్రయత్నం చేసి వారు కూడా అదే చెరువులో మృతి చెందడం గమనార్హం.

యువకుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్: 'అప్పులు అధికంగా అయ్యాయి.. ఇక నేను ఉండలేను.. ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నా. నన్ను క్షమించండి' అంటూ ఓ యువకుడు తోటి స్నేహితులకు వీడియో కాల్ చేసి ఆత్మహత్య చేసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సాఫి కాలనీకి చెందిన షాహీద్‌ఖాన్(38) కూలీ పని చేస్తూ తన భార్య, ఇద్దరు సంతానాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజులుగా తాగుడుకు బానిసైయ్యాడు. దీంతో భార్య తన పిల్లలను తీసుకోని 15 రోజుల క్రితం అమ్మగారి ఇంటికి వెళ్లిపోయింది. బుధవారం అర్ధరాత్రి 3 గంటల ప్రాంతంలో తన స్నేహితులైన సత్తర్‌ఖాన్‌తో పాటు మరో ఇద్దరికి వీడియో కాల్ చేస్తూ తాను ఇక బతకలేనని చనిపోతున్నానని తెలుపుతూ ఇంట్లో ఉరి వేసుకున్నాడు. వెంటనే సత్తర్‌ఖాన్ షాహీద్‌ఖాన్ కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి సెంట్రింగ్ కార్మికుడి మృతి

రాజేంద్రనగర్: ప్రమాదవశాత్తు ఓ సెంట్రింగ్ కార్మికుడు రెండో అంతస్తు నుంచి పడి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ ఎన్ఐఆర్‌డీ కమాన్ ప్రాంతంలో కొత్తగా భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవన నిర్మాణ పనులను సెంట్రింగ్ కాంట్రాక్టర్ లక్ష్మయ్యకు అప్పగించారు. గురువారం పనులు చేసేందుకు ఒరిస్సాకు చెందిన రాజేంద్ర(28) వచ్చాడు. రెండో అంతస్తులో పనులు చేస్తుండగా గురువారం ఉదయం ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లెక్సీ పెట్టినందుకు కేసు

మణికొండ: తమ హోటల్‌పై గుర్తుతెలియని వ్యక్తులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని ఓ వ్యక్తి నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నార్సింగిలోని అన్సారీ హోటల్‌పై బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఉదయం వచ్చి చూడగా అభ్యంతకర ఫ్లెక్సీ ఉండటంతో సూపర్ వైజర్ ఎస్. ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



ఈసారి వైభవంగా ఆషాఢమాస బోనాలు

సర్వసభ్య సమావేశంలో కమిటీ నూతన అధ్యక్షుడు వెల్లడి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఆలే భాస్కర్ రాజ్

చార్మినార్: భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు నూతన కమిటీ సర్వసభ్య సమావేశం గురువారం రాత్రి గౌలిపురాలోని శ్రీ కన్యకా పరమేశ్వరి హాల్‌లో జరిగింది. ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలపై సమీక్షా జరిపారు. ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలతో పాటు ఆలయాల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై ఈ సమావేశంలో నూతన కమిటీ చర్చించింది. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ నూతన అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నామన్నారు.



బంగారు బోనం (ఫైల్)

ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు అన్నింటినీ ఇప్పటి నుంచే చేసుకోవడానికి ఆయా దేవాలయాల వద్ద కమిటీ ప్రతినిధులు సిద్ధంగా ఉండాలన్నారు. ఉత్సవాల కోసం కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి శ్రీకారం చుట్టాలన్నారు. దేవాలయాల వద్ద అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడానికి సంబంధిత అధికారులకు నివేదికలు అందజేయడానికి తమకు సకాలంలో రాతపూర్వకంగా సబ్మిట్ చేయాలన్నారు. ఉత్సవాల ప్రారంభానికి ముందుగానే అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి మనమందరం కృషి చేద్దామన్నారు. గతంలో లాగా ఈసారి సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ అధ్యక్షుడు రాకేశ్ తివారీ, గాజుల అంజయ్య, మధుసూదన్‌గౌడ్, కమిటీ నూతన ప్రధాన కార్యదర్శి గాజుల రాహుల్‌తో పాటు ప్యారసాని వెంకటేశ్, మాణిక్ ప్రభు గౌడ్, హన్స్‌రాజ్, ఎస్.పి.క్రాంతి కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేదు'



కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ అక్బర్ హుస్సేన్, వహీద్ అహ్మద్

గోల్కొండ: ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటం చేసి సాధించుకున్న సీఎం కేసీఆర్ దేశ రాజకీయాల్లో కూడా ప్రధానపాత్ర పోషించడం ఖాయమని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద అక్బర్ హుస్సేన్ అన్నారు. ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయ భవనం ప్రారంభమైన సందర్భంగా గురువారం వారు టోలిచౌకి విరాట్‌నగర్ కాలనీలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సెక్యులర్ విధానాలు, దేశ ప్రజలందరికీ నచ్చుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు వహీద్ అహ్మద్, అజ్మతుల్లా, మణిందర్ సింగ్, సంతోష్, మహ్మద్ జాకీర్ హుస్సేన్ తదితరులున్నారు.

'కర్ణాటకలో కాంగ్రెస్ జీరో'

గోల్కొండ: కర్ణాటకలో తాము గెలిస్తే ఆర్ఎస్ఎస్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ ప్రకటించడం ఆ పార్టీ నాయకుల అవివేకానికి నిదర్శమని బీజేపీ నాయకులు బి.శ్రీకాంత్‌చారి, బాలాజీ సూర్యవంశీ అన్నారు. కాంగ్రెస్ పార్టీని దేశ ప్రజలు ఏనాడో మరచిపోయారని, కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చకపోవడంతోనే బీజేపీకి పట్టంకడుతున్నారని వారు అన్నారు. ఆర్ఎస్ఎస్ అంటే దేశ రక్షణ కోసం పాటుపడే సంస్థ అని, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ముందుకు తీసుకుపోయేందుకు నిబద్ధతతో వివాదాలకు తావు లేకుండా పని చేసే సంస్థ అని వారు అన్నారు. ఏదేమైనా కాంగ్రెస్ పార్టీ ప్రజల తిరస్కారానికి గురికావడం ఖాయమన్నారు.

ప్రభుత్వ పథకాలను అందించేందుకు కృషి



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు ముందుంటానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో విడుదలైన 80 కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కార్యాలయంలో రాజాసింగ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందించేందుకు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తాను సహించేది లేదన్నారు. అలాంటి డబ్బులు డిమాండ్ చేసే వారి వివరాలు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. లబ్ధిదారులకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందించేందుకు తానెప్పుడూ కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు.

బజరంగ్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సూర్యప్రకాష్ శుక్లా



అబిడ్స్: బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోషామహల్‌కు చెందిన న్యాయవాది సూర్యప్రకాష్ శుక్లా నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ జాతీయ బజరంగ్ సేన కోర్ కమిటీ అధ్యక్షుడు రణ్‌బీర్ పటేరియా ఆదేశాలు జారీచేశారు. నూతనంగా నియమితులైన సూర్యప్రకాష్ శుక్లా మాట్లాడుతూ.. గోవధ నిషేధ చట్టం అమలుకు హిందూ సంస్కృతిని మరింత పెంచేందుకు, మానవత్వ సేవలు చేసేందుకు, మహిళా సంక్షేమానికి, మహిళా రక్షణ, గోవుల రక్షణకు ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. గోవధ నిషేధ చట్టం రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అమలు చేసే విధంగా నిరంతరం ఆందోళన చేస్తామన్నారు. హిందుత్వాన్ని కాపాడేందుకు, హిందుత్వాన్ని పెంపొందించేందుకు బజరంగ్ సేన ముందుంటుందని సూర్యప్రకాష్ శుక్లా పేర్కొన్నారు.

దోమల నివారణకు చర్యలు



మలేరియా సిబ్బందితో సూపర్‌వైజర్ మహ్మద్

గోల్కొండ: దోమల నివారణకు మందును స్ప్రే చేస్తున్నామని గోల్కొండ డివిజన్ మలేరియా సూపర్‌వైజర్ మహ్మద్ అన్నారు. గురువారం ఉదయం ఆయన బల్దియా వార్డు కార్యాలయంలో బల్దియా సిబ్బంది దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గోల్కొండ కోట కందకాలతో పాటు చెత్త కుండీ పరిసరాలలో మందును స్ప్రే చేయాలని ఆయన అన్నారు. అదే విధంగా ఇంటింటికీ తిరిగి ముఖ్యంగా ఇళ్లలోని వాటర్ ట్యాంకులు, టాయిలెట్ల వద్ద మందును స్ప్రే చేయాలన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి జయంతి

గోల్కొండ: కార్వాన్‌లోని లక్ష్మీనరసింహ స్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం తెలంగాణ ప్రాంత పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ దంపతులు లక్ష్మీనరసింహ స్వామి వారి దర్శనం చేసుకున్నారు. అనంతరం జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దుబ్బాక కృష్ణ, ముదిగొండ నర్సింహులు తదితరులున్నారు.



స్వామి వారి పూజల్లో అంబటి శ్రీనివాస్ దంపతులు

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హర్షం

నాంపల్లి: కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి సోమయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన నాంపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చారిత్రాత్మకమని పేర్కొన్నారు. బంగారు తెలంగాణ సాధనకు, రాష్ట్ర పురోభివృద్ధికి ఉద్యోగులుగా తాము మరింత కష్టపడతామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులుగా కొనసాగిన వారు ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులుగా మారడం సంతోషంగా ఉందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించిన సీఎం కేసీఆర్‌కు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

బీఆర్ఎస్ హయాంలో అన్ని రంగాల్లో తెలంగాణ టాప్



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నందకిశోర్ వ్యాస్, పూజవ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. పర్యాటక రంగం, ఐటీ రంగాలు దేశంలోనే నంబర్:1 స్థాయిలో ముందుకు వెళ్తున్నాయని ఆయన అన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలు తెలంగాణ అభివృద్ధిని, ప్రగతిని సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. బేగంబజార్ ప్రాంతంలో నూతన పిజ్జాహట్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. అన్ని వర్గాల ప్రజల కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పూజవ్యాస్ బిలాల్, పప్పుమాత్రే, ప్రదీప్‌రాజ్, కోటి శైలేష్‌కురుమ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ఆదరించాలి

మణికొండ: ప్రజల వద్దకే ఆర్టీసీ వారు అన్ని రూట్లలో బస్సులను నడుపుతున్నారని, వాటిని ప్రతిఒక్కరూ ఆదరించాలని నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్ అన్నారు. గురువారం మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి నార్సింగి వరకు 221 నెంబరుతో ఏర్పాటు చేసిన బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర శివార్లలో అన్ని రూట్లలో అడిగిన వెంటనే బస్సులను నడుపుతున్నారన్నారు. వాటిల్లో రద్దీ పెరిగితే రాబోయే రోజుల్లో మరిన్ని బస్సులను ఏర్పాటు చేస్తారన్నారు. హెచ్‌సీయూ డిపో మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు చొప్పున నేటి నుంచి నడుపుతున్నామన్నారు. నార్సింగి నుంచి ఉదయం మొదటి బస్సు 7.20 గంటలకు, చివరి బస్సు 8.25గంటలకు ఉంటాయని, మియాపూర్ నుంచి ఉదయం 6.25 గంటలకు రాత్రి 7.30 గంటలకు చివరి బస్సు ఉంటుందన్నారు.



నార్సింగిలో కొత్త బస్సును ప్రారంభించిన వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



బొడ్రాయి వద్ద పూజల్లో భక్తులు

గోల్కొండ: బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు ముగిశాయి. తెలంగాణలో గోల్కొండ బోనాలు ప్రారంభమయ్యే లంగర్‌హౌస్‌లో బొడ్రాయిని ప్రతిష్ఠించాలని బోనాల రంగం కార్యక్రమంలో అమ్మవారు భవిష్యవాణి వినిపించింది. దీంతో లంగర్‌హౌస్‌లో 5 రోజులుగా బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో చివరగా లంగర్‌హౌస్‌లోని అన్ని బస్తీల నుంచి భక్తులు బొడ్రాయికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి పండగ వాతావరణంలో పెద్దయెత్తున బోనాలు సమర్పించి ఆడిపాడారు. ఈ సందర్భంగా 5 అంతస్తుల భారీ ఎత్తైన బోనం అందరిని ఆకట్టుకుంది.

లింగాయత్ మహా ర్యాలీ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న శంకరప్ప పాటిల్ తదితరులు

జియాగూడ: జూన్ 4న చలో హైదరాబాద్ లింగాయత్ మహా ర్యాలీని చేపడుతున్నట్లు తెలంగాణ లింగాయత్ సమన్వయ సమితి కన్వీనర్ శంకరప్ప పాటిల్, బసవ కృప మాసపత్రిక ప్రకాశకులు కల్వ మల్లికార్జునప్ప అన్నారు. ఈ మేరకు గురువారం జియాగూడ బసవ మండప్‌లో చలో హైదరాబాద్ లింగాయత్ మహా ర్యాలీ బ్రోచర్ విడుదల, విలేకర్ల సమావేశం బసవ మండప పీఠాధిపతి అనిమిషానందస్వామి అధ్యక్షతన జరిగింది. బ్రోచర్‌ను విడుదల చేసిన అనంతరం వారు మాట్లాడుతూ.. చలో హైదరాబాద్ లింగాయత్ మహా ర్యాలీ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జూన్ 4న ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి సుమారు తెలంగాణ రాష్ట్రంలోని 25 సంఘాల ప్రజలు విశేషంగా హాజరవుతున్నారన్నారు. అలాగే కర్ణాటక, తెలంగాణ, ఏపీలకు చెందిన పీఠాధిపతులు లింగాయత్ సమాజ్‌ల ప్రతినిధులు దాదాపు 5 లక్షల వరకు భక్తులతో సహా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దినేష్ పాటీల్, విజయ్‌కుమార్ పట్నే, అనిల్‌కుమార్ పాటీల్, ప్రభాకరప్ప, నాగరాజ్ కాల్సే, ఐ.మధు, యశ్వంత్‌రావు పాటిల్, శ్రీదేవి పాటిల్, సంజీవ్ పాటిల్, రాజ్యశ్రీ, సునిత కాల్సే పాల్గొన్నారు.

రోగులకు సమతుల్యమైన ఆహారాన్ని ఇచ్చేందుకు కృషి

సుల్తాన్‌బజార్: కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో ఆహారపు నాణ్యత గణనీయంగా పెంచామని, సమతుల్యత ఆహారాన్ని రోగులకు అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.శంకర్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో రోగులకు సమతుల్యమైన ఆహారాన్ని ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా తమను సంప్రదించాలని ఆయన అన్నారు. ముక్కు, చెవి, గొంతు సమస్యలతో వచ్చే రోగులకు కావాల్సిన వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా నేరుగా సూపరింటెండెంట్‌ను కలవాలని కోరారు.



సమతుల్య ఆహారాన్ని పంపిణీ చేస్తున్న సిబ్బంది

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు



డీకే శివకుమార్‌ను కలిసిన గౌంటి కుమార్ చౌదరియాదవ్ తదితరులు

సుల్తాన్‌బజార్: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని సమైకాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ జాతీయ అధ్యక్షుడు గౌంటి కుమార్ చౌదరి యాదవ్ వెల్లడించారు. గురువారం హైదర్‌గూడలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బెంగళూరు సౌత్ కేఆర్.పురం అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డీకే మోహన్‌బాబుకు మద్దతుగా తమ పార్టీ ప్రచారం నిర్వహించిందని తెలిపారు. ప్రస్తుతం కర్ణాటకలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ మత సమరస్యాన్ని చెడగొట్టేల వ్యవహరిస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో కర్ణాటక ప్రజలు సైతం కాంగ్రెస్ పార్టీకి మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీకే కుమార్, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవం

నాంపల్లి: లక్ష్మీనరసింహ స్వామి జన్మస్తవం వేడుకలు వైభవంగా జరిగాయి. రెడ్‌హిల్స్‌లోని యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఈ వేడుకలు కొనసాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి అభిషేకం, హోమం, సత్యనారాయణ స్వామి వ్రతం, సామూహిక కుంకుమార్చన, పూలాభిషేకం వంటి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, నేతలు ఆలయానికి చేరుకుని లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం పురవీధుల్లో స్వామి వారికి పల్లకీ ఊరేగింపు జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం జరిగింది. అర్జున్, బాబురావు, చోటూ సింగ్, గిరిధర్, మహంత్ సోనూదాస్, రాజు ప్రసాద్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మహంత్ సోనూదాస్, రాజు ప్రసాద్ మిశ్రా

ప్రజా సంక్షేమానికి ప్రత్యేక కృషి



పనులు ప్రారంభిస్తున్న ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్ దిడ్డి పెంటయ్య, గోవింద్‌రాజ్

అబిడ్స్: ప్రజా సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తామని రాష్ట్ర ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్, ఆసిఫ్‌నగర్ రిజినల్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ దిడ్డి పెంటయ్య పేర్కొన్నారు. ఆసిఫ్‌నగర్ ప్రాంతంలో ఫ్లాట్‌ఫామ్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. బస్తీలు, మురికివాడలు, స్థానిక ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. అన్నిశాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గోవింద్‌రాజ్‌లు, జె.శ్రీనివాస్, ఎం.నాగులుచారి, లక్ష్మీనారాయణ, కిషన్, వినాయక్, మహేష్, బాబుచారి పాల్గొన్నారు.

డీసీపీ కార్యాలయ భవనానికి మరమ్మతులు షురూ

చార్మినార్: పురానీహవేలిలోని దక్షిణ మండలం డీసీపీ కార్యాలయ (పాత పోలీసు కమిషనరేట్ భవనం) భవనానికి మరమ్మతులు ప్రారంభమయ్యాయి. గతంలో భారీగా కురిసిన వర్షాలతో పాటు శిథిలావస్థకు చేరిన డీసీపీ కార్యాలయ భవనం పైకప్పు కుప్పకూలింది. దీంతో డీసీపీ కార్యాలయంలోని సిబ్బంది తమ కార్యాలయాన్ని ఖాళీ చేశారు. పక్కనే ఉన్న స్పెషల్ బ్రాంచ్ జాయింట్ సీపీ కార్యాలయం భవనంలోని మొదటి అంతస్తులోకి మారారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దక్షిణ మండలం డీసీపీ కార్యాలయం మొదటి అంతస్తులోనే కొనసాగుతుంది. రెండు రోజుల క్రితం కూలిన డీసీపీ పాత భవనానికి మరమ్మతు పనులు ప్రారంభమై జోరుగా కొనసాగుతున్నాయి.



'కర్ణాటకలో మజ్లిస్ గెలుపు ఖాయం'



కార్వాన్ ఎమ్మెల్యేకౌసర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మజ్లిస్ నాయకుడు శివశంకర్

గోల్కొండ: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ పోటీ చేస్తున్న అన్ని స్థానాలు గెలుచుకుంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని నగరానికి వచ్చిన ఆయనను మజ్లిస్ సీనియర్ నాయకుడు టి. శివశంకర్ గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణను ఆనుకుని ఉన్న కర్ణాటక జిల్లాలలో మజ్లిస్ పార్టీకి ప్రజాభిమానం మెండుగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు మజ్లిస్ పార్టీని ఆదరిస్తున్నారని అన్నారు. మజ్లిస్ పార్టీ ఎన్నికల సభలకు భారీ ఎత్తున ప్రజలు హాజరవుతున్నారని, ఎన్నికల ప్రచారం మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ సభలు విజయవంతమవుతున్నాయని ఆయన అన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు ఉత్సవాలు

బహదూర్‌పురా: సుల్తానుల్ వయజీన్ హజ్రత్ సూఫీ షా ముహమ్మద్ అబ్దుల్ ఖాదర్ చిస్తీ రాజ్ అలై రహ్మ 88వ ఉర్సు ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. మిశ్రీగంజ్‌లోని సూఫీ మంజిల్‌లో ఏప్రిల్ 29న ప్రారంభమైన ఈ ఉర్సు-ఏ-షరీఫ్ ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల సందర్భంగా గుసుల్-ఏ-షరీఫ్, ఫాతిమా, దువా, సందల్ ఊరేగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అనంతరం రెండు రోజుల ఉత్సవాల్లో ముస్లిం పెద్దలు, స్కాలర్స్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలతో ఉర్సు ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల్లో ముస్లిం ప్రముఖులు మౌలానా అజ్మీర్ షరీఫ్ దర్గా ప్రముఖుడు హజ్రత్ సయ్యద్ ఖాజా గయాసుద్దీన్ చిస్తీ అజ్మీరి, మౌలానా ముజఫర్ అలీ సూఫీ, మౌలానా సూఫీ అబ్దుల్ ఖాదర్ సానీ, మౌలానా జుబేర్ సూఫి, మౌలానా సయ్యద్ తన్వీర్ పాషా, మౌలానా సయ్యద్ షా అబ్దుల్ రవూఫ్ హుస్సేనీ, మౌలానా హఫీజ్ ఖాజా మోహినుద్దీన్ సూఫీ తబ్రేజ్ పాషా, సూఫి అబ్దుల్ రాఫే తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మత ప్రముఖులు